రవి రాజు విజయనగరం చేరేసరికి సాయంత్రం దాటిపోయింది. లోకం చీకటిని కాటుకలా పులుముకుందామని కాచుకు కూర్చుంది.

ఒకప్పుడు విజయనగరంలోనే చదివాడు రవిరాజు. డిగ్రీ చేపట్టాక వదిలి వెళ్లిపోయిన అతను ఇంతకాలానికి సీతంరాజు పెళ్లి మూలంగా ఆ వూరు రావటం జరిగింది.

సీతంరాజు, రవిరాజు మిత్రుడు. ఇద్దరూ కలిసి మెలిసి తిరిగారు. ఎంత అల్లరిగా తిరిగారో—అంత శ్రద్ధగా క్లాసులో ఫస్టు మార్కులు సంపాదించేవారు. అందుకే వారి జీవితాలిప్పుడు నల్లేరుపైన బండి నడకలా సాగిపోతున్నాయి.

బస్ స్టాండులో నిలబడ్డ రవిరాజు గతంలోంచి బయటపడి చెదిరిన క్రాపుని సరిచేసుకుని జిడ్డువారి వీధికి రిక్షాలో వెళ్లాడు.

అతను రిక్షా దిగగానే "ఏరా రవీ! నిన్ను తన్నినా పాపం లేదు! మూడు రోజులు ముందుగా రమ్మని వ్రాస్తే ఇప్పుడా రావటం?" అని చివాట్లతోనే పలకరింపు ప్రారంభించాడు సీతంరాజు.

నవ్వుతూనే—"సెలవుల్లేవోయ్! మరీ అంతలా దెప్పి పొడవకు... రేపొద్దున్న నా పెళ్లికి ఎన్ని రోజులు ముందుగా వస్తావో చూస్తాగా!" అన్నాడు.

సీతంరాజు ఇంకా ఏదో ఒకటి మాట్లాడుతూనే మిత్రుని చేత స్నానాదికాలు పూర్తి చేయించాడు.

పెళ్లి చేసుకోడానికి ముందుగా వధూవరులు తమ గత జీవితాల గురించి ఒకరికొకరు చెప్పుకోడానికి, ఒకరి స్వభావాన్ని మరొకరు అర్థం చేసుకోడానికి ఈనాటి వివాహ వ్యవస్థలో ఎంతవరకూ అవకాశం వుంది? అటువంటి అవకాశాలు లేనప్పుడు, ఇతరులు చెప్పిన మాటల ఆధారంగానే వాళ్లు నిర్ణయాలు తీసుకోవాలా? ఆ నిర్ణయాల పరిణామం ఏ విధంగా వుంటుంది?




తన మిత్రుణ్ణి "ప్రఖ్యాత కార్టూనిష్టు రవిరాజు"గానే అక్కడి వారికి పరిచయం చేశాడు—సీతంరాజు.

పెళ్లికి వచ్చిన వాళ్లల్లో ఒక అమ్మాయి కొంచెం హుషారుగా మాట్లాడ్డం గమనించాడు రవిరాజు. ఆ అమ్మాయి బాపు బొమ్మలా, తీగలా నాజూగ్గా ఉంది.

రవిరాజు ఆమెను పరిశీలనగా చూస్తూండగా సీతంరాజుని ఎవరో పెళ్లి పెద్దలు లాక్కెళ్లారు.

"మీరు కార్టూనిస్టు రవిరాజుగారా! నమస్కారం... తరచుగా మీ కార్టూన్లు వివిధ పత్రికల్లో చూస్తుంటాను... మీ లైనింగ్ చాలా బాగుంటుంది. ఈ మధ్య "నాయకుడే వినాయకుడైతే" పేజీ కార్టూన్ చాలా బాగుంది... రాజకీయనాయకులకు చురక అంటించారు. నైస్ కార్టూన్. అయినా మీకెలా అయిడియాలొస్తాయో, ఒకవేళ అయిడియాలొచ్చినా ఎలా గీస్తారో" అంది ఆ అమ్మాయి.

"ఎలా ఏమిటండీ! రకరకాల మనుష్యుల్ని ప్రదేశాల్ని చూస్తుంటాం కదా! దాన్ని బట్టి వ్యంగ్యత జోడించి గీస్తాను. బొమ్మలు వేయటం చిన్నప్పటినుంచీ వచ్చు... ఇంతకీ మీపేరు...?" అడిగాడు రవిరాజు.

"నా పేరు విచిత్ర! మీకు విచిత్రంగా అనిపిస్తూంది కదూ!" అంది నవ్వి.

"లేదు! ఫ్యాషన్ కోసం పెట్టినట్టు అనిపిస్తూంది. ఈ మధ్య రచయిత్రుల నవలల్లో పాత్రల పేర్లు మరీ విచిత్రంగా, విడ్డూరంగా అనిపిస్తున్నాయి. హృదయ, సహన, భవ్య... ఇలా ఎన్నో" అన్నాడు నవ్వుతూనే.

ఆ నవ్వుతో తన నవ్వు జోడించింది విచిత్ర.

వారి వాక్ప్రవాహంలో ఎన్నో విషయాలు దొర్లాయి.

అతన్ని బాగా ఆకట్టుకుంది ఆ అమ్మాయి.

ఐతే ఆ సమయంలోనే పెళ్లి కొడుకు పిలుస్తున్నాడని ఎవరో చెప్పేసరికి అక్కణ్నుంచి కదిలాడు రవిరాజు.

"ఒరే! అంతా పెళ్లి పనుల్లో ఉండిపోయారు. ఈ పంచెతో పీటలమీద కూర్చోవాలంటే చెడ్డ సిగ్గుగా అని

పిస్తూంది. కొట్నాం పెడతారట. నా బుగ్గలు తెగ పొంగిపో యాయని అనాయ కాబోలు—బుగ్గల్ని లోపలికి నొక్కి పారేస్తారట..." అని డొక్కు దవడల్ని తడుముకున్నాడు సీతంరాజు.

"మనకు నచ్చినా నచ్చకపోయినా కొన్ని సంప్రదాయా లు పాటించాలి బ్రదర్! తప్పదుమరి!" అని మాట్లాడు తున్నాడేగాని రవిరాజు మనసు ఇంతసేపూ మాట్లాడిన ఆ అమ్మాయి గురించే ఆలోచిస్తోంది.

సీతంరాజేమో వదలడం లేదు జిడిలా.

చదువుకున్న రోజుల్లోనూ అంతే... ఒక్కడూ దేనికీ వెళ్లలేక పోవటమే కాక సాయం ఉన్నవాడిని కూడా ఎంతకూ వదిలేవాడు కాదు...

ఇప్పుడు మరీ చాదస్తుడైపోయాడు!

పార్టీ మారిపోదామని చూస్తున్న వాడిని బాధించి తమ పార్టీలోనే ఉంచడానికి చూస్తున్న రాజకీయ నాయ కుడిలా కనుపించసాగాడు సీతంరాజు.

"ఒరే సీతూ! అవతల ముహూర్తం దగ్గర పడుతోంది పద... పద..." అంటూ ఒక ముత్తయిదువ తత్తర బిత్తరగా వచ్చి లాక్కుపోయింది.

సీతం రాజు నిష్క్రమణతో హాయిగా ఊపిరి పీల్చా డు రవిరాజు. అప్పుడతని కళ్లు ఇందాకటి అమ్మాయి కోసం అన్వేషించసాగాయి.

# చూడు చూడు నీడలు

**— కె. కె. భాగ్యశ్రీ**

ఆ గదిలో టీపాయ్ పైన ఆటలకు సంబంధించిన పత్రికలు, ఇంకా లబ్ధప్రతిష్ఠుల నవలలు వున్నా వాటిపై అతని దృష్టి నిలవటం లేదు.

సిగరెట్ తీసి వెలిగించి బయటకు నడిచాడు.

"హల్లో బిజీయా!" అంటూ రవిరాజుని సమీ పించింది విచిత్ర.

"రండి... రండి... మీ కోసమే చూస్తున్నాను. వరమ బోరెత్తి పోతోంది..." అని గదిలోకి దారి తీశాడు.

"బోరేమిటండీ! ఓహో మీ భాగ్య నగరంలా ఈ విజయనగరంలో ఏమీ లేవనా?! మీకు ఖాళీగా ఉంటే యిక్కడికి దగ్గరలో ఉన్న రామతీర్థం వెళ్లండి. చారిత్రా త్మక ప్రదేశం... కోదండ రాముడి కొండ మీద రకరకాల సుందర దృశ్యాలు చూడవచ్చు..." అని చెప్పింది.

"చదువుకొనే రోజుల్లో చూశాను... రామతీర్థం చాలా బావుంటుంది. ఇంతకీ ఏమిటి ఇక్కడి విశేషాలు?" అడిగాడు.

"అన్నట్టు మీతో ఒక ముఖ్య విషయం చెబుదామని వచ్చాను!" అని కనుబొమ్మలు విద్దూరంగా ముడిచి అంది.

"ఏమిటంత ముఖ్యమైన విషయం... చెప్పండి..."

"ఎలా చెప్పాలో అర్థం కావటంలేదు!" బాధ ధ్వ నించింది ఆమె గొంతులో

"నోరుందిగా... చెప్పండి" నవ్వాడు.

"కార్టూనిస్టు అనిపించుకున్నారు కాని... అయినా ఇది జోకులు వేసే సమయం కాదు... విన్నాక మీకే తెలుస్తుంది."

"విచిత్రగారూ ఏమిటంతా అదోలా మాట్లాడుతున్నా రు. చెప్పండి ప్లీజ్" అభ్యర్థనగా అన్నాడు.

"నేను చెప్పేది పూర్తిగా వినండి... మీ శ్రేయస్సు కోరి చెపుతున్నాను. గంట్యాడ హైస్కూల్లో పనిచేసే కౌండిన్య రావు మేష్టారి కూతురు సాగరికని మీకిద్దామనుకుంటు న్నారు కదూ!"

"ఔను మొన్ననే చూశాను. నాకు ఆ అమ్మాయి నచ్చింది. చేసుకోవాలనుకుంటున్నాను" జవాబిచ్చాడు రవిరాజు.

"ప్చ్! పాపం! మిమ్మల్ని చూస్తూంటే నాకు జాలే స్తుందండీ!"

"ఏమిటి మీరనేది?" సందేహంగా అడిగాడు.

"ప్రముఖ కార్టూనిస్టు అయిన మీకు జీవిత భాగస్వా మిగా సాగరికను ఊహించుకుంటే... అబ్బ ఇంక చెప్పలే నండీ!" అని ఆగింది విచిత్ర.

"ఏమండీ! మీరు చెప్పేది నాకు అయోమయంగా అనిపిస్తూందండీ!" అని చెమట్లు పడుతున్న నుదుటిని రుమాలుతో తుడుచుకున్నాడు.

"సాగరిక గురించి మీకు చెప్పాల్సింది చాలానే ఉంది. దాన్ని గంట్యాడలో నేను చదువుకున్నప్పుడే తెలుసు. ఈ మధ్య గంట్యాడ మా పిన్ని గారింటికి వెళ్లాను. అప్పుడే దాని గురించి కొన్ని విషయాలు తెలిశాయి. సాగరిక భరతశర్మనే అతణ్ణి ప్రేమించింది. ఇద్దరి ప్రేమా ప్రవహించి, ప్రవహించి ప్రణయం దాకా ప్రాకింది. ఆ మోజులో ఇద్దరూ తెలిసో తెలియకో తప్పుచేశారు. తర్వాత మాష్టారికి తెలిసింది. వేరే కులంవాడితో తన కూతురు సన్నిహితం కావడం సహించలేక పోయారు. కాని భరతశర్మ ప్రతిరూపం సాగరికలో పెరుగుతుందని తెలిసినా డాక్టర్ల సాయంతో తొలగించారే తప్ప శర్మతో ఆమె వివాహానికి అంగీకరించ లేదు. ఆ వెంటనే ఇవేవీ తెలియని మీకు సాగరికని అంటగట్టడానికి ప్రయత్నిస్తున్నారు. ఆ మధ్యనే మీకీ విషయం వ్రాద్దామనుకున్నాను. కానీ మీ చిరునామా తెలీలేదు. సారీ... మీ మనసు బాధపెట్టేనేమో" అని ముగించింది.

అది వినగానే రవిరాజు ముఖం ఎరుపెక్కింది.

కళ్లల్లో క్రోధం క్రమ్మింది... ఆవేశంలో గుండెలు ఎగర సాగాయి.

"ఛీ! ఎంత వంచించారు. కౌండిన్యరావు మాష్టారు ఇంత ద్రోహం తలపెట్టాలని చూస్తారా! సాగరిక స్వభావం ఇంత నీచమైనదని మీరు చెప్పగా తెలి సింది... ఇంకానయం. ఆ చరిత్రహీనతో నా వివాహమ య్యేది! థాంక్ గాడ్!! అందంగా ఉందని ఒప్పుకున్నా ను. కానీ... ఇంత... ఛ ఛ!! పోనీలెండి ఇప్పటికయినా తెలిసింది. ఇంటికి వెళ్లిన వెంటనే నాన్నతో చెప్పేస్తాను... ఇష్టంలేదని, సంబంధం కాన్సిల్ చేయమని చెప్పి వ్రాయిస్తాను." అన్నాడు ఆవేశంగా.

అతని మనస్సంతా అల్లకల్లోల సాగరంలా అయిపో యింది.

ఇంతలో బయటనుండి చప్పట్లు కొడుతూ ఒక అమ్మాయి గదిలోకి వచ్చింది.

"కంగ్రాట్స్ విచిత్రా!! చక్కగా నాటకం ఆడి రక్తి కట్టించావు. పాత్రధారులిద్దరికీ నా ధన్యవాదాలు..."

నోట్లో వచ్చి వెలక్కాయ వడ్డటయ్యింది రవిరాజుకి.

"ఏం సార్! నేను... సాగరికని... గంట్యాడలో కౌండిన్య రావు మాస్టారింట్లో పెళ్లి చూపుల్లో మీరు చూసిన సాగరికను... ఇప్పుడే మీ హృదయంలో మాయని మచ్చని ఏర్పరచుకున్న సాగరికని..." ధీమాగా అంది సాగరిక.

"మీరు... మీరు..." నసిగాడు రవిరాజు.

"ఆఁ అసలు పాయింటుకే వస్తున్నా! నా పెళ్లి గురించి నేనెన్నో అందమైన ప్రణాళికలు వేసుకున్నాను! నా భర్త ఎంతో ఉన్నత వ్యక్తిత్వం కలవాడు కావాలని, నా మీద దృఢమైన నమ్మకం, పటిష్ఠమైన విశ్వాసం ఉన్నవా డు కావాలని, ఇతరుల మాటల్ని నమ్మి అనుక్షణం హింసించేవాడు కారాదని... ఇంకా ఎన్నెన్నో... పెళ్లికా కుండానే కాబోయే భర్త వ్యక్తిత్వం తెలుసుకోదలిచాను.... పెళ్లి కొడుకు సీతంరాజు పెళ్లికి మీరొస్తారని తెలిసింది. పెళ్లి కూతురు నాకు స్నేహితురాలు... అందుకే ముందుగా విచిత్రద్వారా ఈ నాటకం ఆడి మీ అసలు మనసును తెలుసుకున్నాను. విచిత్ర చెప్పిన తర్వాతైనా అంతా అబద్ధం అని కాని, నమ్మలేకుండా ఉన్నానని కాని, ఈ విషయమై వాకబు చేస్తానని కాని ఏమీ అనకుండానే, అనాలోచితంగా, మూర్ఖంగా-నిర్హేతుకంగా ఉన్న విషయాల్ని మీకెవరో ఇంతవరకూ తెలీని ఒక అమ్మాయి చెప్పిన మాటల్ని—నమ్మారు. పెళ్లినే రద్దు చేయాలని అభిప్రాయ పడ్డారు. ఒక కార్టూనిస్టు అయిన మీ మనస్సులో భావాలు కూడా వంకరటింకరగా ఉంటా యనుకోలేదు. అల్పమైన ఆలోచనలనుండి మీ మనసు ఎదగలేదు. మీ మనస్తత్వం తెలిసినందుకు సంతోషం. మీరిప్పుడు చేసుకుంటానన్నా మిమ్మల్ని చేసుకుందికి సిద్ధంగా లేను. గుడ్‌బై... రావే విచిత్రా!" అని ధైర్యంగా చెప్పేసి మిత్రురాలిని తీసుకుని గబగబ పెళ్లి పందిట్లో కి వెళ్లిపోయింది సాగరిక.

అగాధంలో పడిన వాడిలా ఉండిపోయాడు రవిరాజు.

Vamakoti Seeta Rama Sastry
WRITER APSEB JAO (Retd)
RAMAKRISHNA NAGAR
Plot No. 24
SRIKAKULAM